

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (మంగళ) సా.6.19
సహరి (బుధ) ఉ.4.58

సత్యదేవుని హుండీల ఆదాయం రూ.1.88 కోట్లు 7

మోతుగూడెంలో అంబరాన్నంటిన మన్యంకొండ జాతర 7

కాకినాడలో భారీ పేలుడు

- ఉల్లిబాంబుల పార్శిల్ దింపుతుండగా ఘటన 7

ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీల్లో తనిఖీలు

కాకినాడక్రైం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలు, కొరియర్ సర్వీసుల్లో ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాలతో పోలీసులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. పోలీస్‌జాగిలాలు, బాంబ్‌స్క్వాడ్‌లు విస్తృత తనిఖీలు నిర్వహించాయి. పేలుడు సంభవించే గుణమున్న రసాయనాలు, మాదకద్రవ్యాలపై ఆరాతీస్తూ సోదాలు చేపట్టారు. ఇటువంటి వాటిని రవాణాచేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.



ట్రాన్స్‌పోర్ట్ గొడౌన్‌లో తనిఖీలు చేస్తున్న బాంబ్ స్క్వాడ్

'సెకండియర్' షురూ!

- జిల్లాలో ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభం
- 19,241మంది విద్యార్థులు హాజరు

కాకినాడ రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు లాంగ్వేజ్ పేపర్-2(తెలుగు, సంస్కృతం, హిందీ) పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈవో జీజీకే నూకరాజు తెలిపారు. ఉదయం 9గంటలనుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ జిల్లావ్యాప్తంగా 56 కేంద్రాల్లో ఏ ఇబ్బందులు లేకుండా పరీక్షలు జరిగాయన్నారు. పరీక్షా కేంద్రాలవద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారు. జిల్లాలో జనరల్, ఒకేషనల్ విభాగాల్లో 19,754మంది విద్యార్థులు హాజరుకావాల్సిఉండగా 19,241మంది పరీక్షలకు హాజరుకాగా 513మంది విద్యార్థులు రాయలేదన్నారు.మంగళవారం ఇంటర్ ప్రథమ సంవత్సరవిద్యార్థులకు సంబంధించిన ఆంగ్ల పరీక్ష జరుగుతుందని డీఐఈవో తెలిపారు.

● జిల్లాలోని 24 కేంద్రాల్లో సోమవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహించిన ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలకు 6269మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 5650మంది హాజరైనట్లు జిల్లా సమన్వయ కర్త పి.సాయివెంకటరమణ తెలిపారు.



అన్నవరంలోని కళాశాలలో హాల్‌టిక్కెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు



పరీక్షా కేంద్రానికి ఉరుకులు.. పరుగులు



విద్యార్థిని చెక్ చేస్తున్న దృశ్యం

బ్యాలెట్.. బాక్సింగ్!



ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలో ఓట్ల లెక్కింపు

ఉదయం నుంచి ఎమ్మెల్సీ ఓట్లతో కుస్తీ

- సుదీర్ఘంగా బ్యాలెట్ ఓట్ల లెక్కింపు
- కట్టలుగా కట్టేందుకే 12 గంటలు
- 700 మంది సిబ్బంది నియామకం
- మూడు షిఫ్టులుగా విధులు
- రాత్రి 8 నుంచి లెక్కింపు ఆరంభం
- 10 గంటలకు తొలిరౌండ్ పూర్తి
- ఫలితానికి మరింత సమయం
- ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ

(ఏలూరు - ఆంధ్రజ్యోతి)

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు టెన్షన్.. టెన్షన్‌గా సాగుతోంది. సోమవారం రాత్రి 8 గంటలకు ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలోని కౌంటింగ్ కేంద్రంలో ప్రారంభమైన ప్రక్రియ తొలి రౌండ్ ఫలితం రాత్రి పదిన్నరకు వెల్లడైంది. ఫిబ్రవరి 27న జరిగిన పోలింగ్‌లో మొత్తం 35 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. రెండు లక్షల 18 వేల 902 ఓట్లు పోలయ్యాయి. ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో కౌంటింగ్‌కు గాను 28 టేబుల్స్ వినియోగించి 17 రౌండ్లలో పూర్తిచేయాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియ సోమవారం ఉదయం ఆరంభమై రాత్రి పొద్దు పోయేంత వరకు నిరవధికంగా కొనసాగుతోంది. ఓట్ల లెక్కింపునకు వీలుగా ఉదయం ఎనిమిది గంటల నుంచే సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా తొలుత స్ట్రాంగ్ రూముల నుంచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ కేంద్రానికి చేర్చారు. సాధ్యమైనంత మేర కౌంటింగ్ ప్రక్రియలో జాప్యం నివారించేందుకు ప్రయత్నిస్తున్నా పొద్దు పోయేంత వరకు బ్యాలెట్ పత్రాలు బండిల్స్‌గా కట్టేందుకు ఎక్కువ సమయం తీసుకుంది. 17 రౌండ్ల వారీగా బ్యాలెట్ బాక్సుల్లోని పత్రాలను బయటకు తీసి తొలుత కట్టలుగా కట్టారు. ఈ ప్రక్రియ నిరవధికంగా కొనసాగేందుకు వీలుగా 28 టేబుళ్లలో 17 రౌండ్ల మేర కొనసాగించేందుకు ఏర్పాట్లుచేసి మూడు షిఫ్టుల్లో 700 మంది సిబ్బంది, అధికారులను రంగంలోకి దించారు.

లెక్కింపు..ఈజీ కాదు..

సాధారణంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు అంత సులువుగా సాగదు. ఈసారి అదే పరిస్థితి ఆవిష్కృతమైంది. ఉదయం నుంచే సిబ్బందిని కౌంటింగ్ కేంద్రాల్లో మోహరించి వారికి బ్యాలెట్ బాక్సులు తెరవడం, వాటిలో ఉన్న బ్యాలెట్ పత్రాలను బండిల్స్‌గా కట్టడం వంటి ప్రక్రియను అప్పగించారు. తొలి మూడు గంటల్లో పోస్టల్ బ్యాలెట్లను పరిశీలించారు. మొత్తం పోస్టల్ బ్యాలెట్‌లు 242 కాగా వీటిలో 201 బ్యాలెట్ పత్రాలు చెల్లుబాటు కాగా మరో 41 చెల్లకుండా పోయాయి. ఉదయం 11 గంటల నాటికే పోస్టల్ బ్యాలెట్‌ల తతంగాన్ని ముగించారు. సమాంతరంగా రౌండ్‌ల వారీగా బ్యాలెట్ పత్రాలు బండిళ్లుగా కట్టలు కట్టే పనిని కొనసాగిస్తూ వచ్చారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, మిగతా అధికారులు కౌంటింగ్ ప్రక్రియ ఆరంభం నుంచి క్షణక్షణం పరిశీలించడంలో నిమగ్నమయ్యారు. కౌంటింగ్ కేంద్రంలో గుర్తింపుకార్డులున్న వారినే అనుమతించారు. మీడియాను నిర్దేశించిన ప్రాంతంలోనే ఉంచారు. మధ్యాహ్నం నుంచి కొందరిని అనుమతించారు.



లెక్కింపు కేంద్రం వద్ద కూటమి అభ్యర్థి పేరాబత్తుల

బండిల్స్‌గా కట్టేందుకే ఒకరోజు..

సాధారణ ఎన్నికలకు భిన్నంగా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలను వినియోగించారు. ఈకారణంగా బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ కేంద్రంలోకి రప్పించడం, వాటి నుంచి బ్యాలెట్ పత్రాలను వెలికి తీసి బండిళ్లుగా కట్టడానికి చాలా సమయం తీసుకుంది. రౌండ్‌ల వారీగా పదివేలకు తగ్గకుండా ఈ బండిళ్లను ఏర్పాటు చేస్తూ వచ్చారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల్లోపు సుమారు పది వేల ఓట్లతో మొదటి రౌండ్ బండిళ్లుగా కట్టగలిగారు. అప్పటి నుంచి 11వ రౌండ్ వచ్చే సరికి బ్యాలెట్ పత్రాలను కట్టలుగా కట్టేందుకు ఏడు గంటల సమయం తీసుకుంది. వాస్తవానికి కౌంటింగ్ కేంద్రంలో రౌండ్‌ల సంఖ్య, టేబుల్స్ సంఖ్య కాస్త పెంచి ఉంటే ఇంత సుదీర్ఘ సమయం పట్టేది కాదు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు లోబడి అతి తక్కువ టేబుళ్లను వేసి కౌంటింగ్‌కు దిగారు. ఒకవైపు బ్యాలెట్ పత్రాలను బండిళ్లుగా చేసేందుకు సమయం పడుతుండడంతో అభ్యర్థులతోపాటు ఎన్నికల ఫలితాలపై ఎదురు చూస్తున్న వారంతా ఉత్కంఠకు గురయ్యారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్‌లో తొలి ప్రక్రియ మాత్రమే రాత్రి వరకు కొనసాగుతూ వచ్చింది. రాత్రి ఎనిమిది గంటల సమయానికి బండిళ్లుగా కట్టడం పూర్తయ్యింది. ఈ మొత్తం ప్రక్రియకు మొత్తం 12 గంటల సమయం పట్టింది. రాత్రి 8 గంటల ప్రాంతంలో తొలి రౌండ్ ఓట్ల లెక్కింపు ఆరంభించారు. ప్రచారంలో నువ్వానేనా అన్నట్టుగా సాగిన వ్యవహారం ఓట్ల లెక్కింపు లోను అదే ఉత్కంఠ కొనసాగుతోంది.

తొలి రౌండ్ పేరాబత్తులదే..

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు టెన్షన్.. టెన్షన్‌గా సాగుతుంది. ఎనిమిది రౌండ్‌లుగా ఒక్కో రౌండ్‌కి 28 వేలు చొప్పున లెక్కించేందుకు రంగంలోకి దిగారు. ఒక్కో రౌండ్‌లోను చెల్లినవి, చెల్లని ఓట్లు విడివిడిగా విభజిస్తారు. సోమవారం రాత్రి 8 గంటలకు ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలోని కౌంటింగ్ కేంద్రంలో ప్రారంభమైన ఈ ప్రక్రియ తొలి రౌండ్ ఫలితం రాత్రి పదిన్నరకు వెల్లడైంది.కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి 16,520 ఓట్లు, సమీప పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల రాఘవులుకు 5,815 వేల ఓట్లు, ఇతరులకు 3249 లభించాయి. 2416 చెల్లని ఓట్లు ఉన్నాయి. ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి మంగళవారం రాత్రి పొద్దుపోవచ్చని అంచనా వేస్తున్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు


ఏలూరు క్రైం : ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్ కేంద్రమైన సర్ సీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద ఎస్పీ కేపీఎస్ కిశోర్ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసి స్వయంగా పరిశీలించారు. సోమవారం వేకువజామునే కౌంటింగ్ విధులకు నియమించబడిన ఉద్యోగులు, ఏజెంట్లను పోలీస్ సిబ్బంది మెటల్ డిటెక్టర్లతో, బ్రీత్ ఎనలైజర్లతో తనిఖీలు చేశారు.సెల్‌ఫోన్‌లు బయట కౌంటర్‌లోనే ఉంచేలా చర్యలు తీసుకున్నారు. బందోబస్తులో ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్, పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు, నూజివీడు డీఎస్పీ ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, డీఎస్పీ యుగంధర్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్

ఇదిగో ప్రగతి

- జిల్లాలో బ్యాంకుల్లో ప్రజలు దాచుకున్న డబ్బు రూ.20,567కోట్లు
- తిరిగి అప్పులు రూపంలో ఇచ్చిన డబ్బు రూ.33,844కోట్లు
- ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఇప్పటివరకు జిల్లాలో రోగులకు చెల్లించింది రూ.703కోట్లు
- బ్యాంకులు రైతులకు ఇచ్చిన అన్ని రుణాలు రూ.7,557కోట్లు
- 2024-2025 రాష్ట్రప్రభుత్వ సోషియో ఎకనామిక్ సర్వేలో వెల్లడి
- కాకినాడలో ఓ భారీ పరిశ్రమ ద్వారా రూ.10వేలకోట్ల పెట్టుబడి



(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలో మొత్తం 367అన్ని రకాల బ్యాంకు బ్రాంచ్‌ల్లో ప్రజలు దాచుకున్న డబ్బు రూ.20,567 కోట్లుగా రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన 2024-2025 సోషియో ఎకనామిక్ సర్వే వెల్లడించింది. అటు ఈబ్యాంకులు ప్రజలకు అప్పులరూపంలో ఇచ్చిన మొత్తం రూ.33,844 కోట్లుగా ఉన్నట్లు పేర్కొంది. ఎన్టీఆర్ వైద్య సేవ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో పేదరోగులకు చికిత్సకోసం ప్రభుత్వం రూ.703కోట్లు చెల్లించినట్లు నివేదిక వివరించింది. రాష్ట్రప్రభుత్వం సోమవారం సోషియో ఎకనామిక్ సర్వే పేరుతో 465 పేజీల నివేదిక వెల్లడించింది. ఇందులో రాష్ట్రం ఏయే రంగాల్లో ప్రగతి దిశగా కదులుతోంది.. ఆయా రంగాల్లో ప్రగతి ఎలా ఉంది. జిల్లాల వారీగా వ్యవసాయ, ఉద్యాన, పారిశ్రామిక, ప్రజల ఆర్థిక స్థితిగతులు వంటి అనేక కీలక అంశాలకు సంబంధించి కూలంకుష నివేదిక విడుదల చేసింది. ఇందులో 2024 ఏప్రిల్ నుంచి 2025 డిసెంబర్ వరకు ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలవారీగా ఆయా సామాజిక, ఆర్థిక స్థితిగతులను గణాంకాల రూపంలో విశ్లేషించింది. అందులో భాగంగా కాకినాడ జిల్లాకు ఈ ఆర్థిక సంవత్సరంలో ఓ భారీ పరిశ్రమ ద్వారా రూ.10వేలకోట్ల పెట్టుబడి వచ్చిందని వివరించింది. మరోపక్క జిల్లాకు అత్యంత కీలకమైన ఏలేరు ఆధునికీకరణను వచ్చే ఏడాది చేపడుతున్నట్లు వెల్లడించింది. 69శాతం పూర్తయిన ఈప్రాజెక్టును పూర్తి చేయనున్నట్లు వివరించింది.

పోర్టులతో లాభాల పంట..

కాకినాడలోఉన్న ప్రభుత్వ యాంకరేజ్‌పోర్టు నాలుగు మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో సామర్థ్యం పనిచేస్తోందని నివేదిక వివరించింది. 2024-2025లో దీని ద్వారా రూ.46.08కోట్ల రెవెన్యూ వచ్చిందని తెలిపింది. పక్కనే ఉన్న డీప్‌వాటర్ పోర్టును రూ.293కోట్లతో మూడు బెర్తులతో నిర్మించారని, దీన్ని కాకినాడ సీపోర్టు లిమిటెడ్‌కు అవార్డు ఇచ్చినట్లు నివేదికలో ప్రస్తావించారు. తద్వారా దీనికి వచ్చే నికర లాభంలో ఏటా 22శాతం రెవెన్యూ షేర్ రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వాలని వివరించారు.ప్రస్తుతం ఏడు బెర్త్‌లకు విస్తరించిన ఈపోర్టుకు 558 ఎకరాలు లీజుకు ప్రభుత్వం ఇచ్చింది. మరోపక్క 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నవంబరువరకు పోర్టు 11.15మెట్రిక్ టన్నుల కార్గో హ్యాండిల్ చేయగా రూ.461కోట్లు రెవెన్యూ సమకూరింది. ఇందులో ప్రభుత్వ వాటాగా రూ.101.42కోట్లు రాబడి వచ్చింది. కాకినాడ సీపోర్టుకు సంబంధించి 2024-2025 కార్గో హ్యాండ్లింగ్ సామర్థ్యం 17.62 ఎంఎంటీ కాగా, నవంబరు నాటికి 11.15 మిలియన్ మెట్రిక్ టన్నులు హ్యాండిల్ చేసింది. రూ.150కోట్ల రెవెన్యూ టార్గెట్‌కుగాను ఇప్పటివరకు రూ.101.42కోట్లు వచ్చింది. కాకినాడ యాంకరేజ్ పోర్టు 4మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో ఈఆర్థిక సంవత్సరానికి పూర్తి చేయాల్సి ఉండగా, డిసెంబరు వరకు 2.326కు చేరుకుంది.రెవెన్యూ రూ.60కోట్లకుగాను రూ.46.08 కోట్లకు చేరుకుంది. కాకినాడ సెజ్‌లో 1,944 ఎకరాల్లో నిర్మితమవుతున్న పోర్టు వ్యయం రూ.2,123కోట్లు. ప్రస్తుతం ఇందులో మూడు బెర్త్‌లు నిర్మిస్తుండగా, ఒకటి బొగ్గు హ్యాండ్లింగ్ కోసం, రెండు జనరల్ కార్గో కోసం నిర్మిస్తున్నారు. 2024నవంబరునాటికి పోర్టులో 22.57 శాతం పనులు పూర్తయ్యాయి. ఇది నిర్మితమైతే పోర్టు సామర్థ్యం 16 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గోగా ఉన్నట్లు నివేదిక వివరించింది. ఏపీ మేరిటైం బోర్డు 2047కి దీన్ని మరింత అభివృద్ధి చేయడానికి సిద్ధమవుతోంది.

రూ.30.68కోట్లు ఖాతాల్లో పడ్డాయి

కాకినాడ జిల్లాలో మొత్తం 1,060 రేషన్ దుకాణాలున్నాయి. ఇందులో అంత్యోదయ కార్డులు 23,186, పేదల కార్డులు 6,31,463, మొత్తం 6,54,649 కార్డులున్నాయి. దీనికి సంబంధించి నెలకు ప్రభుత్వం 9,853 మెట్రిక్ టన్నుల బియ్యం విడుదల చేస్తోంది. జిల్లాలో దీపం-2 పథకం లబ్ధిదారులు 3,88,306కాగా వారికి ఇప్పటివరకు రూ.30.68కోట్లు సబ్సిడీ డబ్బులు ఖాతాల్లో పడ్డాయి. జిల్లాలో ఎల్‌పీజీ కనెక్షన్లు దీపం పథకంకింద 196,094, సీఎస్సార్ 45,891, పీఎంయూవై 36,710, జనరల్ కనెక్షన్లు 4,34,064.మొత్తం 7,12,801 గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్లు తేలాయి. జిల్లాలో 33వేల హెక్టార్ల అటవీ భూమి ఉంది. జిల్లాలో కాలువల ద్వారా 1.29లక్షల హెక్టార్లు, చెరువుల ద్వారా 8వేల ఎకరాలు, బావుల ద్వారా 24వేలు, మొత్తం 1.71లక్షల హెక్టార్లలో వరి సాగవుతోంది. వ్యవసాయానికి సంబంధించి అగ్రికల్చర్ క్రెడిట్ లోన్లు స్వల్ప కాలికం కింద రూ.3,964కోట్లు, టెర్మ్ లోన్లు ఇతర అనుబంధ రంగాలకు కలిపి రూ.3,593కోట్లు ఇవ్వగా, మొత్తం వ్యవసాయ రుణాలు రూ.7,557 కోట్లుకు చేరాయి.

పాల వెల్లువే...

జిల్లాలో మామిడి 12హెక్టార్లు, అరటి 62, బొప్పాయి 78, ఆరెంజ్ 20, ఆయిల్‌పాం 20 వేల హెక్టార్లు, మిర్చి 5.75హెక్టార్లు కలిపి మొత్తం 53హెక్టార్లలో వాణిజ్య పంటలు సాగవుతున్నాయి. మరోపక్క జిల్లాలో గతేడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు 586మెట్రిక్ టన్నుల పాలు, మాంసం 35,528మెట్రిక్ టన్నులు, గుడ్లు 2.26లక్షలు ఉత్పత్తయ్యాయి. ఇది కాక జిల్లాలో పశువులు 76,502, గేదెలు 2,82,273, గొర్రెలు1,41,229, మేకలు 1,01,870, పందులు 4,394, పౌల్ట్రీ 92.28లక్షలు ఉన్నట్లు తేలింది. రొయ్యల ఉత్పత్తికి సంబంధించి 2023-2024 ఆర్థిక సంవత్సరం లో మెరైన్‌ఫిష్, ష్రింప్ 1,32,325 మెట్రిక్ టన్నులు ఉత్పత్తికాగా, ఫ్రెష్‌వాటర్ ప్రాన్ 1,13,452 మెట.. కలిపి మొత్తం 2,69,729. మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అయింది. 2024- 2025 ఆర్థిక సంవత్సరం డిసెంబర్ వరకు 1,91,410 మెట్రిక్ టన్నులు దిగుబడి వచ్చింది.

రూ.10వేలకోట్ల పెట్టుబడి..

జిల్లాలో కోరింగ అభయారణ్యం 235.70 చదరపు కి.మీ. విస్తీర్ణంలో ఉంది. సెరీకల్చర్ రైతులు 733మంది ఉండగా, వీరి ద్వారా 136.8 మెట్రిక్ టన్నుల సిల్క్ ఉత్పత్తి అవుతోంది. జిల్లాలో గోదాములు 16 ఉండగా వీటి సామర్థ్యం 15,055మెట్రిక్ టన్నులు. జిల్లాలో డిసెంబరువరకు మార్కెట్ ఫీజు రూ.26.32 కోట్లు వసూలైంది. పారిశ్రామికపరంగా భారీగా అభివృద్ధి జరుగుతోంది. 2024-2025 లో డిసెంబరు నాటికి ఓ పెద్ద పరిశ్రమ జిల్లాలో రూ.10వేల కోట్ల పెట్టుబడితో ముందుకు వచ్చింది. దీని ద్వారా 4వేలమందికి ఉపాధి లభించనుంది. జిల్లాలో ఫ్రోజెన్ రొయ్య, జీడిపప్పు, బియ్యం ఎగుమతికి పెద్ద హబ్‌గా మారే అవకాశం ఉందని నివేదిక విశ్లేషించింది. జిల్లాలో పుష్కర ద్వారా 44,152 ఎకరాలకు నీరు అందుతోంది. 2026కి ఏలేరు ఆధునికీకరణ పూర్తికానుంది. తాండవ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 51,465ఎకరాలకు నీరు అందుతోంది.

డబ్బే డబ్బు..

జిల్లాలో 2023-2024లో రవాణా వాహనాల రిజిస్ట్రేషన్ ద్వారా రూ.145కోట్లు ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. 2024-2025 డిసెంబరువరకు రూ.136కోట్లు వసూలైంది. జిల్లాలో రెండు హెడ్ పోస్టాఫీసులు ఉండగా, 50 సబ్ పోస్టాఫీసులున్నాయి.జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో అన్నిరకాల బ్యాంకులకు సంబంధించి బ్రాంచ్‌లు 102, సెమీ అర్బన్‌లో 125, అర్బన్‌లో 140ఉండగా, మొత్తం 367 బ్రాంచ్‌లున్నాయి. వీటిలో ప్రజలు రూ.20,567కోట్లు డబ్బులు దాచుకోగా తిరిగి ప్రజలకు బ్యాంకులు రూ.33,844కోట్లు అప్పులు ఇచ్చాయి.

పవన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే దొరబాబు

- త్వరలో జనసేనలో చేరిక
- ఆయన వెంటే పలువురు వైసీపీ నేతలు



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిసిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కుటుంబసభ్యులు

పిఠాపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు జనసేనలో చేరికకు లైన్‌క్లియర్ అయింది. ఆయన తన కుటుంబసభ్యులతో కలిసి సోమవారం సాయంత్రం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ సీఎం,జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను కలిశారు. వీరి మధ్య పలు అంశాలపై చర్చలు జరిగాయి. జనసేనలో చేరేందుకు దొరబాబు ఆసక్తి చూపగా పవన్ అందుకు అంగీకారం తెలిపినట్లు సమాచారం. త్వరలోనే ఆయన జనసేన పార్టీలో చేరనున్నారు. ప్లీనరీకి ముందుగా ఈ వారాంతలోనే చేరిక ఉంటుందని జనసేన వర్గాలు తెలిపాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు వైసీపీ టిక్కెట్టు నిరాకరించడంతో అప్పటినుంచి అసంతృప్తిగా ఉన్న దొరబాబు ఎన్నికల అనంతరం వైసీపీకి రాజీనామా చేశారు. కూటమి పార్టీల్లో చేరనున్నట్లు ప్రకటించిన ఆయన కొంతకాలంపాటు స్తబ్ధుగా ఉన్నారు. సోమవారం జనసేన అధినేతతో నేరుగా భేటీ కావడంతో చేరికకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. నియోజకవర్గంలోని పలువురు వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధులు జనసేనలో చేరే అవకాశాలు ఉన్నాయి. దొరబాబుతో ఆయన సతీమణి అన్నపూర్ణ, కుమార్తె ఆషిత, అల్లుడు రక్షారామయ్య, రఘు, బన్ను తదితరులు ఉన్నారు.

జిల్లా డీఆర్‌డీఏ పీడీగా శ్రీనివాసరావు

అడిషనల్ పీడీగా సాయినాథ్ జయచంద్ర

కలెక్టరేట్(కాకినాడ), మార్చి3(ఆంధ్రజ్యోతి): జిల్లా డీఆర్‌డీఏ పీడీగా జి.శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. ఈయన నెల్లూరు జిల్లా డ్వామా కార్యాలయ ఏపీడీగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీ అయ్యారు. జిల్లా డీఆర్‌డీఏ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా టి.సాయినాథ్ జయచంద్ర నియమితులయ్యారు. ఈయన విజయవాడ డ్వామా కార్యాలయంలో పనిచేస్తూ ఇక్కడకు బదిలీ అయ్యారు. ఈయన్ను కోనసీమ జిల్లా డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీగా కూడా నియమించారు.

కార్పొరేషన్ అకౌంట్స్ ఎగ్జామినర్‌గా...

కాకినాడ కార్పొరేషన్ అకౌంట్స్ ఎగ్జామినర్‌గా కె.విజయ్ మోహన్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈయన స్టేట్ ఆడిట్ విభాగంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తూ కాకినాడ బదిలీ అయ్యారు.

ప్రభుత్వాస్పత్రుల పనులు..

త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ),మార్చి 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో జరుగుతున్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆస్పత్రి సిబ్బందితో సోమవారం ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరుగుతున్న నాబార్డ్, ఇతర సివిల్ వర్క్స్‌పై ఏపీఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిల్లా వైద్య సేవల సమన్వయాధికారి, ఆస్పత్రుల మెడికల్ సూపరింటెండెంట్ తదితర ఇన్‌చార్జిలతో సమీక్షించారు. ప్రతి ఆస్పత్రిలో పనుల మంజూరు.. వాటి స్థితి.. ఎప్పటికి పూర్తవుతాయి.. తదితర విషయాలపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో ఏపీఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రత్నరాజు, జిల్లా వైద్యసేవల సమన్వయాధికారి డాక్టర్ స్వప్న, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్, కాకినాడ పరిధిలోని ఆస్పత్రుల మెడికల్ సూపరింటెండెంట్ పాల్గొన్నారు.



కౌంటింగ్ నేపథ్యంలో మద్యం నిషేధం: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 3(ఆంధ్రజ్యోతి): శాసనమండలి తూర్పు-పశ్చిమ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 135సీ, రాష్ట్ర ముఖ్యఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మంగళవారం కాకినాడ జిల్లాలో మద్యం విక్రయాలను నిషేధించి డ్రైడేగా ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి షాన్‌మోహన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. లిక్కరు షాపులతోపాటు హోటళ్లు, రెస్టారెంట్లు, క్లబ్బుల్లో కూడా ఈ నిషేధం విధించారు.

మరణంలోనూ వీడని స్నేహం!

- ట్రాలీని ఢీకొన్న మోటారుసైకిల్
- ముగ్గురు యువకులు మృతి 7
- జగ్గంపేట మండలం రామవరం వద్ద ఘటన

లైంగిక వేధింపులకు పాల్పడిన హెచ్‌ఎంపై పోక్సో కేసు 7

'టిస్' ఆధారంగా సీనియారిటీ జాబితా 7

మహిళా ఉద్యోగులకు సాంస్కృతిక, ఆటల పోటీలు 7



వన దేవత అమ్మవారిని సీలేరు నదిలో పడవలో నుంచి...
అనంతరం పొల్లూరు జలపాతం వద్దకు ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం


అమ్మవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్, అడిషనల్ ఎస్పీ పంకజ్‌కుమార్‌మీనా

గిరిజన జాతర

అంబరాన్నంటిన మన్యంకొండ జాతర
పొల్లూరు జలపాతం వద్దకు పోటెత్తిన ఒడిశా, ఆంధ్ర భక్తులు
బంగారు చేప దర్శనంతో తన్మయత్వం

మోతుగూడెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలోని పొల్లూరు గ్రామంలో సోమవారం జరిగిన మన్యంకొండ జాతరకు ఒడిశా, ఆంధ్ర భక్తులు పోటెత్తారు. ముందుగా ఒడిశా సరిహద్దు నుంచి మన్యంకొండ దేవతను సీలేరు నదిలో ప్రత్యేక కొత్త పడవపై పొల్లూరు తీసుకొచ్చారు. అక్కడ చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్, అడిషనల్ ఎస్పీ పంకజ్‌కుమార్‌మీనా, ఏపీ జెన్‌కో లోయర్ సీలేరు ప్లాంట్ మేనేజర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్ కొబ్బరికాయలు కొట్టి అమ్మవారిని ఆహ్వానించారు. అనంతరం పొల్లూరు మైదానంలో మిద్దెలను ఏర్పాటు చేసి అమ్మవారిని కూర్చోబెట్టారు. అక్కడ పొల్లూరు అర్చకుడు అయినవిల్లి కుమారస్వామి ఆధ్వర్యంలో ఐటీడీఏ పీవో, అడిషనల్ ఎస్పీ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. నానావిధ పరిమళ పుష్పాలు, ధూప, దీప నైవేద్యాలతో పూజారి కుమారస్వామి శర్మ పూజలు చేశారు. అనంతరం వేలాది మంది గిరిజనులు నృత్యాలు, మేళతాళాలతో వన దేవతను పొల్లూరు జలపాతం వద్దకు తీసుకువెళ్లారు. అక్కడ ఒడిశా నుంచి వచ్చిన పూజారులు వారి విధానంలో పూజలు జరిపారు. జలపాతం నీటి దగ్గరకు వచ్చి నైవేద్యం సమర్పించగానే బంగారు చేప


బంగారు చేపకు ప్రసాదం సమర్పిస్తున్న పూజారులు

దర్శనమిచ్చింది. ఒడిశా ప్రజలంతా ఒక్కసారిగా అమ్మవారి నామస్మరణ చేస్తూ బంగారు చేపకు నమస్కరించుకున్నారు. జలపాతం వద్ద పూజారుల స్నానం అయ్యాక అమ్మవారి ఘటాలను నీటిలో ముంచి తీశారు. తర్వాత భక్తులంతా జలపాతంలో స్నానాలు చేశారు. జలపాతం వద్ద నుంచి అమ్మవారిని సీలేరు నది దాటించి ఒడిశాకు తీసుకెళ్లారు. దీంతో ఆంధ్రాలో మన్యంకొండ జాతర పూర్తయింది.

ఏర్పాట్లు భేష్...

మన్యంకొండ జాతరలో పాల్గొనేందుకు ఒడిశా రాష్ట్రం నవరంగపూర్ ఎంపీ బలబద్రి మజ్జి, మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడకామీ సోమవారం ఫ్లోటింగ్ బ్రిడ్జి దాటి పొల్లూరు


జాతరకు వచ్చిన నవరంగపూర్ ఎంపీ బలబద్రి మజ్జి, మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడకామీ

చేరుకున్నారు. వారికి ఎంపీడీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి జి.మోహన్ కండువాలు కప్పి ఆహ్వానించారు. అక్కడి నుంచి నేరుగా పొల్లూరు జలపాతం వద్దకు వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ మన్యంకొండ జాతరకు వచ్చే రెండు రాష్ట్రాల ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆంధ్ర అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. చింతూరు మండల అధికారులు సీలేరు నది వద్ద వైద్య శిబిరాలు, తాగునీటి సౌకర్యం, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో జాతర ప్రశాంతంగా జరిగిందన్నారు. చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్, అడిషనల్ ఎస్పీ పంకజ్ కుమార్‌మీనా, మల్కన్‌గిరి ఐటీడీఏ పీవో దుర్యోధన బోయ్, సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, ప్లాంట్ మేనేజర్ బాలకృష్ణ, సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, చింతూరు సీఐ తెల్లం దుర్గాప్రసాద్, మోతుగూడెం ఎస్‌ఐ శివనారాయణ, డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్, గంగవరం ఎస్‌ఐ వెంకటేశ్వర రావు, చింతూరు తహసీల్దారు శ్రీనివాసరావు జాతరను పర్యవేక్షించారు. జాతరకు దాదాపు 40వేల మంది భక్తులు హాజరుకాగా వారికి భోజన ఏర్పాట్లు చేశారు. అన్నపూర్ణ ట్రస్టు నిర్వాహకులు, స్థానిక యువకులు, వ్యాపారస్తులు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు, మంచినీళ్ల పంపిణీ చేశారు.


మన్యంకొండ జాతరను తిలకించేందుకు వచ్చిన భక్తులు

బాలయోగి ఆశయ సాధనకు కృషి

» త్వరితగతిన కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్ నిర్మాణం » కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ


బాలయోగి ఘాట్‌లో నివాళులర్పిస్తున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, ఎంపీ హరీష్‌మాధుర్

అమలాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కోనసీమ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేసిన లోక్‌సభ దివంగత స్పీకర్ సేవలు మరువలేనివని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని జీఎంసీ బాలయోగి ఘాట్‌లో సోమవారం జరిగిన బాలయోగి 23వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అందరితోనూ ఆప్యాయంగా ఉండే ఆయన హెలికాప్టర్ ప్రమాదంలో అకాల మృత్యువు చెందడం దురదృష్టకరమన్నారు. తొలుత మంత్రి అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌తో కలిసి బాలయోగి విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. బాలయోగి ఆశయాల్లో అత్యంత ప్రధానమైన కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి రైళ్లను నడిపేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. తన తండ్రి ఆశయ సాధనకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని హరీష్‌మాధుర్ హామీ ఇచ్చారు. బాలయోగి ఘాట్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చిల్లా జగదీశ్వరి, మానేపల్లి అయ్యాజీ వేమా, ఆల్డా చైర్మన్ యాళ్ల దొరబాబు, కూటమి నేతలు పెచ్చెట్టి విజయలక్ష్మి, ఆకుల రామకృష్ణ, నాగిడి నాగేశ్వరరావు, నల్లా పవన్‌కుమార్, శిరిగినీడి వెంకటేశ్వరరావు, దెందుకూరి సత్తిబాబురాజు, కేతా శ్రీనివాస్, అడబాల సత్యనారాయణ, చింతం కృష్ణ, మోకా వెంకటసుబ్బారావు, పెచ్చెట్టి చంద్రమౌళి, ఆర్వీ నాయుడు, మద్దింశెట్టి సూరిబాబు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బాలయోగి ఘాట్‌లో నివాళులర్పించారు. అంతకు ముందు బాలయోగి తనయుడు హరీష్‌మాధుర్ తన గృహంలో శాస్త్రోక్తంగా పూజలు జరిపి నివాళులర్పించారు. ఇటీవల మరణించిన టీడీపీ కోరింగ గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంట పల్లి చంద్రమౌళి కుటుంబానికి బాలయోగి జ్ఞాపకార్థం రూ.లక్ష చెక్కును కేంద్ర మంత్రి, ఎంపీ అందజేశారు.


పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ సుజాత

మహిళా ఉద్యోగులకు సాంస్కృతిక, ఆటల పోటీలు

కాకినాడ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులకు సాంస్కృతిక, ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ బి.సుజాత పేర్కొన్నారు. పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం కలెక్టర్ షాన్ మోహన్ ఆవిష్కరించారు. 5న జరిగే క్రీడా పోటీల ప్రారంభోత్సవ సభకు కలెక్టర్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ బుధవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి కాకినాడ ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్‌లోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్‌లో క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు, జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా కోశాధికారి వై.పద్మ మీనాక్షి, సహ అధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.జయలక్ష్మి, కన్వీనర్ దేవి, కాకినాడ టౌన్ అధ్యక్ష, కార్యదర్శులు అరదాడి సత్తిరాజు, వై.రామకృష్ణ, మహిళా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'నన్నయ'లో నారీఫెస్ట్

దివాన్‌చెరువు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నారీఫెస్ట్ నిర్వహిస్తున్నట్టు ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ సోమవారం తెలిపారు. తొలిరోజైన మంగళవారం మామ్మ (అమ్మమ్మ, నానమ్మ) -మనవరాలు ఫ్యాషన్‌షో, హెల్దీ బేబీ పోటీలు జరుగుతాయన్నారు. హెల్దీ బేబీ షోలో పాల్గొనేందుకు ఐదేళ్లలోపు బాలబాలికలు అర్హులన్నారు. స్థానిక మహిళలందరూ ఈ పోటీల్లో పాల్గొనాలని వీసీ కోరారు. హెల్దీ బేబీ పోటీలకు 63057 89433, మామ్మ-మనవరాలు పోటీలకు 99126 62500 నెంబర్లను సంప్రదించాలన్నారు. గురువారం వర్సిటీలో నన్నయ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల మహిళా సిబ్బందికి వివిధ పోటీలు, 6న అంతర్జాతీయమహిళాదినోత్సవం నిర్వహిస్తామని చెప్పారు.

సత్యదేవుని హుండీల ఆదాయం రూ.1.88 కోట్లు

అన్నవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ ఐవీ రోహిత్ పర్యవేక్షణలో సోమవారం లెక్కించారు. రూ.1,88,91,940 నగదు, 66 గ్రాముల బంగారం, 693 గ్రాముల వెండి సమకూరాయి. 129 యూఎస్‌ఏ డాలర్లు, 530 యూఏఈ దిరహమ్స్, సెంట్రల్ బ్యాంక్ 100 ఒమెన్, 50 సింగపూర్ డాలర్లు లభించాయి. 31 రోజులకు ఈ ఆదాయం లభించిందని ఈవో సుబ్బారావు చెప్పారు.



లైంగిక వేధింపులకు పాల్పడిన
హెచ్‌ఎంపై పోక్సో కేసు

కరప, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొర్రిపూడి హైస్కూల్ హెచ్‌ఎం కాశీవిశ్వేశ్వరరావు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్టు విద్యార్థినులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కాకినాడ జిల్లా ఉపవిద్యాశాఖాధికారి ఎన్.వెంకటేశ్వరరావు విచారణ చేపట్టారు. ఎంఈవో కొప్పుల బులికృష్ణవేణి, ఎంఈవో-2 పత్తి సత్యనారాయణలతో కలిసి స్థానిక పాఠశాలను సందర్శించారు. బాధిత విద్యార్థినులను రహస్యంగా విచారించి వివరాలను నమోదు చేశారు. 78మంది విద్యార్థినులను విచారించగా వారిలో 20మంది హెచ్‌ఎంకు వ్యతిరేకంగా రిపోర్టు ఇచ్చినట్టు తెలిసింది. విచారణ నివేదికను డీఈవోకు అందజేస్తామని డీవైఈవో తెలిపారు. విద్యార్థినులపై హెచ్‌ఎం లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ప్రాథమిక విచారణలో నిర్ధారణ కావడంతో అతనిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్టు కరప ఎస్‌ఐ తోట సునీత తెలిపారు.

'టిస్' ఆధారంగా సీనియారిటీ జాబితా

కాకినాడ రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్ కింద పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాను ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ (టిస్) ఆధారంగా రూపొందించినట్టు పాఠశాల విద్య జోన్-2 ఆర్జేడీ జి.నాగమణి తెలిపారు. ఈ జాబితాలను సంబంధిత ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాల వెబ్‌సైట్‌లోనూ, నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉంచామన్నారు. ఈ జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 10లోపు సంబంధిత ఉమ్మడి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోసమర్పించాలని సూచించారు.

మరణంలోనూ వీడని స్నేహం!

● రామవరంలో రోడ్డు ప్రమాదం ● ట్రాలీని ఢీకొని ముగ్గురు యువకుల మృతి


జగ్గంపేట మండలం రామవరంలో సంఘటనా స్థలం వద్ద మృతదేహాలు


అబ్దుల్లా (ఫైల్)


హర్షవర్ధన్ (ఫైల్)


మణికంఠ (ఫైల్)

జగ్గంపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం వద్ద 16వ నెంబరు జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ప్రాణ స్నేహితులైన ముగ్గురు యువకులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... షేక్ అబ్దుల్లా (17), రౌతుల హర్షవర్ధన్ (17), వేణు మణికంఠ కిర్లంపూడి మండలం బూరుగుపూడి నుంచి ఒకే మోటారు సైకిలుపై జగ్గంపేట బయలేర్దారు. రామవరం వచ్చేసరికి ట్రాలీని దాటించబోయి దాన్ని ఢీకొన్నారు. ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందగా మణికంఠ(17) స్థానిక సీహెచ్‌సీలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ట్రాలీ నడుపుతున్న డ్రైవర్ పరారీలో ఉన్నట్టు స్థానిక సీఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న సామాజిక ఉద్యమకారుడు పాతంశెట్టి సూర్యచంద్ర ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించి ఓదర్చారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద జగ్గంపేట వైసీపీ ఇన్‌చార్జ్ తోట నరసింహం, తోట రాంజీ మృతుల కుటుంబీకులను పరామర్శించారు.

కుటుంబాల కోసం కూలీపనుల్లోకి...

ప్రమాదంలో మరణించిన రౌతుల హర్షవర్ధన్, వేణు మణికంఠ కిర్లంపూడి మండలం బూరుపూడి గ్రామానికి చెందినవారు. మరొక యువకుడు షేక్ అబ్దుల్లా ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామం అని స్థానికులు తెలిపారు. వారు ముగ్గురు ప్రాణ స్నేహితులు. పదో తరగతి వరకు చదువుకున్నారు. తర్వాత ఆర్థిక పరిస్థితి రీత్యా స్థానికంగా కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని సాయపడుతున్నారు. షేక్ అబ్దుల్లా తండ్రి కిర్లంపూడి మండలం బూరుగుపూడి సాగు ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. చేతికందివచ్చిన కొడుకులు ప్రమాదంలో మరణించడంతో తల్లిదండ్రులు విలపిస్తున్నారు.

ఉల్లిక్కి పడ్డారు!

» కాకినాడలో ఉల్లిబాంబుల పార్శిల్ దింపుతుండగా భారీ పేలుడు
» ఐదుగురు హమాలీలకు గాయాలు..


లారీ నుంచి పార్శిల్ దించుతున్న దృశ్యం


భారీ పేలుడు సంభవించిన ప్రాంతం


పార్శిల్‌లో వచ్చిన ఉల్లి బాంబుల డబ్బాలు

కాకినాడ క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని ఓ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో సోమవారం ఉల్లిబాంబుల భారీ పేలుడు సంభవించి ఐదుగురు హమాలీలకు గాయాలయ్యాయి. ఈ ఘటనలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జగన్నాథపురం కమర్షియల్ రోడ్డులోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరం ఉన్న జై బాలాజీ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీకి హైదరాబాద్‌లో ఉన్న అదే ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ నుంచి సోమవారం ఉదయం పార్శిల్ లారీ వచ్చింది. ఈ క్రమంలో అక్కడ ఉన్న హమాలీలు ఒక్కో పార్శిల్‌ను కిందకు దించుతున్నారు. గజ్జల మధు అనే హమాలీ లారీ నుంచి ఒక పార్శిల్‌ను దించుతూ కిందకు పడవేశాడు. దీంతో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. దీంతో అక్కడ విధుల్లో ఐదుగురు హమాలీలు చెల్లాచెదురుగా ఎగిరిపడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను 108 వాహనంలో జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారిలో స్థానిక డైరీఫాం సెంటర్‌కు చెందిన 35ఏళ్ల గజ్జల మధు, అదే ప్రాంతానికి చెందిన 32ఏళ్ల మేడిశెట్టి లోవరాజు, కాకినాడ రూరల్ మండలం

ఒకరి పరిస్థితి విషమం

ఏపీఎస్పీ ప్రాంతానికి చెందిన 30ఏళ్ల బొందు అశోక్, ఇంద్రపాలెం గ్రామానికి చెందిన 39ఏళ్ల దారా నగేష్, అదే ప్రాంతానికి చెందిన 55ఏళ్ల బంధాల పోతురాజు ఉన్నారు. మధు పరిస్థితి విషమంగా ఉన్నట్టు జీజీహెచ్ అత్యవసర విభాగ వైద్యులు తెలిపారు.

ఘటన అనంతరం కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్, కాకినాడ ఎస్‌డీపీవో, ఐపీఎస్ అధికారి మనీష్‌దేవరాజ్ పాటిల్, ట్రైనీ ఏఎస్పీ సుస్మిత సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటన జరగడానికి ప్రధాన కారణం చిన్న పిల్లలు గోడకేసి కొట్టే ఉల్లిపాయ టపాసులని ఎస్పీ వెల్లడించారు. స్థానిక పెద్దమార్కెట్‌లో జనరల్ స్టోర్స్ నిర్వహిస్తున్న మాజేటి శ్రీనివాసరావు హైదరాబాద్ నుంచి జై బాలాజీ ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన లారీలో ఒక్కో ప్లాస్టిక్ డబ్బాలో 60 ఉల్లిబాంబులు ఉండేలా ప్యాక్ చేశారు. ఒక్కో పార్శిల్‌లో 30 డబ్బాల చొప్పున 3 పార్శిల్‌లు దిగుమతి చేసుకున్నాడు. అందులో మొదటి పార్శిల్ దింపుతుండగా ఈ విస్ఫోటనం జరిగింది. దీంతో మరో పార్శిల్‌లో ఉన్న పెద్ద పెద్ద నట్లు, బోల్టులు చెల్లాచెదురుగా ఎగిరిపడి హమాలీలకు కాలిన గాయాలయ్యాయి. దీనిపై కాకినాడ వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావ్ కేసు నమోదు చేశారు.

బుకీలు.. బుక్కయ్యారు!

» ఇండియా-న్యూజిలాండ్ మ్యాచ్‌పై బెట్టింగ్ నిర్వహించిన ఆరుగురి అరెస్ట్
» 4 ల్యాప్‌టాప్‌లు, ఎల్ఈడీ టీవీ, 2 లైన్‌బాక్స్‌లు, 2 ట్యాబ్‌లు,50ఫోన్లు స్వాధీనం
» రూ.7.38 లక్షలు నగదు కలిగిన ఖాతా ఫ్రీజ్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘువీర్


పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువులు

రాయవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆదివారం రాత్రి జరిగిన భారత్ - న్యూజిలాండ్ క్రికెట్ మ్యాచ్‌పై ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహించిన రెండు బెట్టింగ్ స్థావరాలపై దాడి చేసి ఆరుగురు క్రికెట్ బుకీలను అదుపులోకి తీసుకున్నట్టు రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ సోమవారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం సోమేశ్వరం గ్రామంలో క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్టు వచ్చిన విశ్వసనీయ సమాచారంపై జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాలపై పోలీసులు బెట్టింగ్ స్థావరంపై దాడులు నిర్వహించారు. సోమేశ్వరం వినాయక కాలనీకి చెందిన లింగాపు సతీష్‌కు చెందిన ఇంట్లో బెట్టింగ్ జరుగుతుండగా బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమేశ్వరం బుకీలు ఇచ్చిన సమాచారంపై ఇక్కడి బెట్టింగ్ స్థావరానికి అనుగుణంగా రాజానగరం మండలం చక్రధారబందం ఒక అపార్ట్‌మెంట్‌లో యమునా బ్లాక్ ప్లాట్ నెంబరు 605లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న మరో నలుగురు బుకీలను అదుపులోకి తీసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. సోమేశ్వరం, చక్రధారబందం గ్రామాల్లో జరిగిన రెండు బెట్టింగ్ స్థావరాలపై దాడులు జరిపి కె.నాగేంద్ర, కేవీ రెడ్డి, ఎన్.రవి, ఎ.వినయ్, జి.గణేష్, పి.వెంకటేష్‌ను అదుపులోకి తీసుకున్నట్టు పేర్కొన్నారు. సోమేశ్వరం గ్రామానికి చెందిన లింగాపు సతీష్ పరారీలో ఉన్నట్టు చెప్పారు. సోమేశ్వరం, చక్రధారబందం గ్రామాల్లో జరిపిన దాడుల్లో 2 క్రికెట్ లైన్ బాక్స్‌లు, 4 ల్యాప్‌టాప్‌లు, వాయిస్ రికార్డర్, ఒకటీవీ, 2 ట్యాబ్‌లు, సుమారు 50 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ తెలిపారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహణకు వాడిన ఖాతాను స్వాధీనం చేసుకుని ఆ ఖాతా నుంచి 7లక్షల 38వేల రూపాయలు నగదు కలిగిన ఖాతాను ఫ్రీజ్ చేసినట్టు తెలిపారు. క్రికెట్ బుకీల ఫోన్ నెంబర్లు ఆధారంగా దర్యాప్తు చేసి ఈ కేసులో ఇంకా ఎంతమంది ఉన్నారు అనే విషయంపై దర్యాప్తు జరుగుతుందన్నారు. బెట్టింగ్ నిర్వహిస్తున్న సోమేశ్వరంతో పాటు పరిసర ప్రాంతాలపై నిరంతరం నిఘా ఉంటుందని డీఎస్పీ తెలిపారు. బెట్టింగ్ స్థావరాలపై దాడులు నిర్వహించేందుకు వ్యవహరించిన మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, మండపేట రూరల్ ఎస్‌ఐ బుజ్జిబాబు, రాయవరం ఎస్‌ఐ సురేష్‌బాబు, ఏఎస్‌ఐ అప్పారావు, హెచ్‌సీ పి.వీర్రాజు, సత్యనారాయణ మూర్తి, కె.లక్ష్మీనారాయణ, శివ, స్వామి, గన్నియ్య, వంశీ, అప్పన్నకుమార్, వీరేంద్ర, సుధాకర్ కుమారిలను డీఎస్పీ అభినందించారు.

చేబ్రోలులో గుర్తు తెలియని వ్యక్తి హత్య!


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

గొల్లప్రోలు రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌రోడ్డు చెంతనే గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మరణించి ఉండగా సోమవారం పోలీసులు కనుగొన్నారు. అతడిని హత్య చేసి ఇక్కడకు తెచ్చి పడవేసినట్టు భావిస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసానికి సమీపంలో ఈ సంఘటన జరగడం కలకలం రేపింది. చేబ్రోలు బైపాస్ రోడ్డు(ఎన్‌హెచ్ 216) పోలవం కాలువ సమీపంలో మరణించి ఉన్న ఆ వ్యక్తి వయస్సు సుమారు 40-50 ఏళ్లు ఉంటుంది. గుర్తు తెలియని వ్యక్తులు అతడిని ఇక్కడే హత్య చేయడం లేదా, మరో ప్రాంతంలో హత్య చేసి ఇక్కడ పడవేసి ఉండవచ్చని భావిస్తున్నారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఎవరు హత్య చేశారు అనే విషయం విచారణలో తేలుతుందని ఎస్పీ తెలిపారు. ఈ కేసును చాలెంజ్‌గా తీసుకుని దర్యాప్తు వేగవంతం చేయాలని సీఐ శ్రీనివాస్‌ను ఆదేశించారు. మృతుడి చేతికి రాగికడియం ఉందని, వివరాలు తెలిసిన వారు పిఠాపురం సీఐ సెల్ 9440796523 లేదా గొల్లప్రోలు ఎస్‌ఐ సెల్ 9440900758 లేదా పోలీసు కంట్రోల్‌రూమ్ సెల్ 9494933 233కు తెలియజేయాలని ఎస్పీ సూచించారు.

హత్యా నేరం రుజువు కావడంతో
యువకుడికి జీవిత ఖైదు

రాజమహేంద్రవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): హత్యా నేరం రుజువు కావడంతో ఓ యువకుడికి జీవిత ఖైదు విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. త్రీటౌన్ సీఐ వి.అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. పాత గొడవల నేపథ్యంలో సీటీఆర్ఐ ప్రాంతానికి చెందిన జీరి వెంకట తోటయ్యను అదే ప్రాంతంలోని దుర్గానగర్‌కి చెందిన యర్రా సాయి (సాయి కిరణ్, షూటర్‌సాయి, దొంగ సాయి) 2021 సెప్టెంబరు 9 తెల్లవారుజామున చాకుతో విచక్షణా రహితంగా పొడిచాడు. అక్కడే ఉన్న సర్వే కర్ర, రాయితో తలపై బలంగా కొట్టి చంపేశాడు. మృతుడి తల్లి జీరి జయలక్ష్మి ఫిర్యాదుతో అప్పటి సీఐ మధుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు, రూ.20 వేల జరిమానా విధిస్తూ పదో అదనపు జిల్లా జడ్జి ఆర్.శ్రీలత తీర్పు వెలువరించారని సీఐ తెలిపారు.

మకరతోరణం నిర్మాణానికి శంకుస్థాపన

● హాజరైన భక్తులు, ప్రజాప్రతినిధులు

గొల్లప్రోలు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉమా రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి (శివాలయం) మకరతోరణం (స్వాగత ద్వారం) నిర్మాణానికి సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ గొల్లపల్లి పెదబాబీ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వివిధ ఆలయాల ప్రతినిధులు, నాయకులు, భక్తులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

తునిరూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): హంసవరం మోడల్ స్కూల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పద్మజ తెలిపారు.

ఫైరింగ్ ప్రాక్టీస్‌లో ఎస్పీ



సాయుధ దళాల ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

గండేపల్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం ఫైరింగ్ రేంజ్‌లో సోమవారం జిల్లా సాయుధ దళాలవార్షిక మొబలైజేషన్ ఫైరింగ్ ప్రాక్టీస్ జరిగింది. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ హాజరై ఫైరింగ్ ప్రాక్టీస్ చేశారు. పోలీసులు ఉపయోగించే అత్యాధునిక ఏకే 47, ఎస్ఎల్ఆర్, ఎంప్, తదితర లాంగ్ రేంజ్, షార్ట్ రేంజ్‌లో 9 ఎంఎం పిస్టల్‌తో ప్రాక్టీస్ చేశారు. అదనపు ఎస్పీ భాస్కరరావు ఉన్నారు.

జీఎంసీ బాలయోగికి ఘన నివాళి



నీలపల్లిలో నివాళి అర్పిస్తున్న నేతలు

తాళ్లరేవు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మాజీ లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి వర్ధంతిని మండల టీడీపీ నేతలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ భవనం వద్ద టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, ధూళిపూడి వెంకటరమణ, మందాల గంగ సూర్యనారాయణ, నడింపల్లి వినోద్, నీలపల్లి జమ్మిచెట్టు వద్ద చిట్టూరి కలికి మూర్తి, వస్కా రెడ్డి, పిల్లి సత్తిబాబు, టిల్లపూడి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొని బాలయోగి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



కోరింగ అభయారణ్యంలో మత్స్యశాఖ విద్యార్థుల సందర్శన

తాళ్లరేవు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆదిత్య ఫిషరీష్ కళాశాల విద్యార్థులకు వన్యప్రాణులపై సోమవారం అవగాహన కల్పించారు. కోరింగ అభయారణ్యంలో సీబీఈటీ ఆధ్వర్యంలో ఫారెస్ట్‌రేంజర్ వరప్రసాద్ అధ్యక్షతన జరిగింది. వన్యప్రాణుల రకాలు, మడ అడవులు, వాటి ఉపయోగాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్వోలు వీరభద్రరావు, సిద్ధార్థ, ఎఫ్‌బీవోలు మహేష్, ధనలక్ష్మి, ధనంజయరావు, సుభాని, మత్స్యశాఖ, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



బాధితురాలికి చెక్కు అందిస్తున్న ఎంపీలు

తాళ్లరేవు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కోరింగ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు, దివంగత వెంటపల్లి చంద్రమౌళి కుటుంబానికి జీఎంసీ బాలయోగి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, భీమవరం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మ సోమవారం రూ. లక్ష చెక్కును బాధితురాలైన వరలక్ష్మికి అందజేశారు. చంద్రమౌళి కుమార్తెలు చదువుల నిమిత్తం సాయం చేస్తానని ఎంపీ హరీష్‌మాధుర్ హామీ ఇచ్చారు. టీడీపీ నేతలు ధూళిపూడి వెంకటరమణ, వెంటపల్లి ఉమామహేశ్వరి, బోయిడి వేణుగోపాల్, మోర్త భైరవమూర్తి, ప్రసాద్, తదితరులు అభినందనలు తెలిపారు.

టాటా గ్రూప్ అధినేత జమ్‌షెడ్జి టాటా జయంతి



జమ్‌షెడ్జి టాటా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పెద్దాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): టాటా గ్రూప్ అధినేత జమ్‌షెడ్జి టాటా జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దాపురం రామారావుపేటలో శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో ఆయన విగ్రహం వద్ద నివాళి అర్పించారు. పాఠశాల అకడమిక్ కోఆర్డినేటర్ నాగప్రశాంతి, మీడియా కోఆర్డినేటర్ ఉషాచైతన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరై ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. టాటాను భారతీయ పరిశ్రమల పితామహుడిగా అభివర్ణిస్తారన్నారు. టాటా అనే సంస్థ నమ్మకానికి ఎంత ప్రతీకగా నిలిచిందో వివరించారు.

తాటిపర్తిలో ముగిసిన హోమాలు

గొల్లప్రోలు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): తాటిపర్తిలో వేంచేసిన అపర్ణ సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో పంచలోహాలతో తయారు చేసిన నూతన ఉత్సవమూర్తుల సమర్పణ సందర్భంగా మూడురోజులుగా నిర్వహిస్తున్న హోమాలు సోమవారం సాయంత్రంతో ముగిశాయి. ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ, చెరుకు శ్రీను పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

● ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో..

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేస్తామని చెప్పి... ఇప్పుడేమో ప్రైవేట్ వ్యక్తులు, బడా కంపెనీలు, ఏజెన్సీలకు అప్పగిస్తామని మంత్రివర్గ సభ్యుల అభిప్రాయాలను పత్రికలో ప్రకటించడంపై ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. దీంతో తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని దశలవారీ పోరాటాలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కిర్ల కృష్ణారావు మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల వేతనాల చెల్లింపులు, సాంఘిక భద్రత అనేది మున్సిపల్ శాఖకే పూర్తిబాధ్యతగా ఉండాలని డిమాండ్‌చేశారు. ప్రైవేట్ కంపెనీలకు, ఏజెన్సీలకు అప్పగించొద్దన్నారు. అలాగే అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ విషయాన్ని పరిష్కరించాలన్నారు. అలాగే 3 డీఏలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సెక్రటరీ లక్ష్మీ నారాయణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ పాల్గొన్నారు.



విలేఖరులతో మాట్లాడుతున్న గౌరవాధ్యక్షుడు కిర్ల కృష్ణారావు

సభావేదిక సమీపంలోనే హెలీప్యాడ్

● స్థలాన్ని పరిశీలించిన జనసేన నేతలు, అధికారులు

పిఠాపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ వేడుకలకు చిత్రాడ ఎస్‌బీ వెంచర్స్ ఆవరణలోని ఖాళీస్థలంలో ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఇప్పటికే సభాప్రాంగణం వద్ద వేదిక నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈనెల 14వ తేదీన జరిగే కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ రానున్నారు. ఇందుకు ప్రత్యేకంగా హెలీప్యాడ్ నిర్మించనున్నారు. దీనికి అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేసేందుకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న మర్రెడ్డి శ్రీనివాసరావు, సీఐ శ్రీనివాస్

వ్యాపారాభివృద్ధికి లక్‌పతి దీది ద్వారా రుణాలు : పీడీ



రుణాలు అందజేస్తున్న దృశ్యం

గొల్లప్రోలు రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): వ్యాపారాలు అభివృద్ధి నిమిత్తం మహిళలకు వ్యక్తిగతంగా లక్‌పతి దీది కార్యక్రమం ద్వారా రూ.లక్ష నుంచి ఐదు లక్షల వరకూ రుణాలు అందజేస్తున్నట్లు డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన లక్‌పతి దీది రుణమేళాలో ఆయన పాల్గొన్నారు. 110 మంది మహిళలకు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు గొల్లప్రోలు, చేబ్రోలు శాఖల ద్వారా మంజూరు చేసిన రూ.1.10 కోట్లను లబ్ధిదారులకు అందజేశారు. బ్యాంకు రీజనల్ మేనేజరు గంటా శ్రీనివాసరావు, డీపీఎం ఎల్‌హెచ్ కేశవరావు, ఏపీఎం సన్యాసిరావు, ఇందిరా ప్రియదర్శిని, బ్యాంకు మేనేజర్లు ఎన్.శ్రీనివాస్, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు కార్డు కీలకం : ఏడీఏ

సామర్లకోట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి రైతులకు 11 అంకెలతో కూడిన విశిష్ట గుర్తింపు కార్డు కీలకమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఈ కార్డే ప్రామాణికం కానుందని కాకినాడ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకురాలు(ఏడీఏ) రత్నప్రశాంతి పేర్కొన్నారు. సామర్లకోట మండలంలోని పలు గ్రామాలలో భూఆధార్ గుర్తింపు కార్డుల నమోదుకు సంబంధించి వ్యవసాయ సిబ్బంది నిర్వహిస్తున్న డేటాఎంట్రీ ప్రక్రియను ఆమె పరిశీలించారు. కాకినాడ జిల్లాలో 1,35,390 మంది రైతులు నమోదు పూర్తి చేసుకున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయకుమార్ చెప్పారు. సామర్లకోట ఎంఏవో ఐ.సత్య, తదితర వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కాకినాడ వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో శనివారం రాత్రి నాటికి కాకినాడ అర్బన్ పరిధిలో 105మంది, కాకినాడ రూరల్ పరిధిలో 2,068 మంది, సామర్లకోట మండలం పరిధిలో 7,916 మంది, పెదపూడి మండలం పరిధిలో 7,330 మంది రైతులు వెరసి 17,419 మంది వివరాల నమోదు పూర్తయ్యాయి.

శ్రీనివాసరావుకు రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాలు

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పెదగంట్యాడలో ఈనెల 1న జరిగిన రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో కాకినాడ ఆర్టీసీ డ్రైవర్ ఎం.శ్రీనివాసరావు రెండు బంగారు పతకాలు గెలుపొందారు. వీటితో కలిపి మొత్తం 80 పతకాలు సాధించిన పవర్ లిఫ్టర్ శ్రీనివాసరావుకు అందరూ అభినందనలు తెలిపారు. జూన్‌లో బెంగళూరులో 40 దేశాలతో జరిగే ఆసియన్ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్టు ఆయన తెలిపారు.



పతకాలు సాధించిన శ్రీనివాసరావు

పిఠాపురంలో కెనేడియన్ బాప్టిస్టు మిషన్ ఉత్సవం



హాలును ప్రారంభిస్తున్న పాస్టర్ థియోఫిలాస్

పిఠాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తెలుగు గడ్డపై కెనేడియన్ బాప్టిస్టుల పరిచర్య ప్రారంభమై 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా పట్టణంలోని ఆంధ్రా బాప్టిస్టు సెంటినరీ చర్చి ఆధ్వర్యంలో సోమవారం కెనేడియన్ బాప్టిస్టు మిషన్ పంచాశధిక శతవత్సర ఉత్సవం నిర్వహించారు. ఉభయ రాష్ట్రాలకు చెందిన సంఘకాపరులు, కెనేడియన్ బాప్టిస్టు చర్చి ప్రతినిధులు హాజరయ్యారు. 150 వసంతాల వార్షికోత్సవంలో భాగంగా సెంటినరీ హాలుపై నూతనంగా నిర్మించిన డాక్టర్ ఈజీ స్మిత్ మెమోరియల్ హాలును పాస్టర్ థియోఫిలాస్ ప్రారంభించారు. ఏబీసీ చర్చి అధ్యక్షుడు గుబ్బల సాల్మన్‌రాజు, హైదరాబాదు, విశాఖపట్టణం, కోటిపల్లి, యలమంచలి, తాళ్లరేవులకు చెందిన పాస్టర్లు డాక్టర్ కేఎల్ మృత్యుంజయ, డాక్టర్ మాథ్యూపీటర్, జాన్ ఇమ్మానుయేలు, దొమ్మేటి వసంతరావు, సామ్యూల్‌రావు, కెనేడియన్ బాప్టిస్టు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలపై విజి'లెన్స్'

● రమణయ్యపేటలో 7,070 కిలోల అధిక బియ్యం నిల్వలు గుర్తింపు



బియ్యం నిల్వలు పరిశీలిస్తున్న ఎంఎస్‌వో మమత, విజిలెన్స్ అధికారులు

సర్పవరం జంక్షన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట, వాకలపూడిలో రెండు రేషన్ దుకాణాలపై సోమవారం విజిలెన్స్ అధికారుల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. అందులో ఓ రేషన్ దుకాణంలో రికార్డుల్లో ఉన్న బేలెన్స్ కంటే అదనంగా 7,070 కిలోల బియ్యం, కందిపప్పు నిల్వలు ఉండటం, మరో దుకాణంలో 317 కిలోల బియ్యం తక్కువ ఉండటాన్ని గుర్తించారు. రామమహేంద్రవరం విజిలెన్స్ ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట, వాకలపూడిలో రెండు రేషన్ దుకాణాలపై ఎంఎస్‌వో మమత ఆధ్వర్యంలో దాడులు జరిగాయి. రమణయ్యపేటలో రేషన్ దుకాణం 45లో రికార్డుల్లో ఉం డాల్సిన నిల్వల కంటే అదనంగా 7,070 కిలోల బియ్యం, 100 కిలోల కందిపప్పు అధికంగా ఉన్నట్టు గుర్తించారు. అలాగే 68.500 కిలోల పంచదార తక్కువ ఉన్నట్టు గుర్తించారు. ఈ విషయమై అధికారులు డీలర్‌ని వివరణ కోరగా ఎంఎల్ఎస్ పాయింట్లో స్టాక్స్ ఆన్‌లైన్ చేసేందుకు సర్వర్ పని చేయలేదని, వేలిముద్ర వేయని కారణంగా ఎక్కువ నిల్వలు ఉన్నట్టు డీలర్ సహదేవరాజు తెలిపారు. ఆర్‌వో ద్వారా సరుకులు పంపించారన్నారు. వాకలపూడిలో షాప్ నెంబర్ 55 లో 317 కిలోల బియ్యం నిల్వ తక్కువ ఉండటాన్ని గమనించారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి ఇక్కడకు తూకంలో తక్కువగా వస్తున్నాయని డీలర్ పిల్లి కిరణ్‌కుమార్ వివరణ ఇచ్చారు. ఇద్దరు డీలర్లపై 6ఏ కేసు నమోదు చేసినట్టు ఎంఎస్‌వో మమత తెలిపారు. మూడు బృందాల ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించడం జరిగిందన్నారు.

'దువ్వాడపై చర్యలు తీసుకోవాలి'



పిఠాపురం రూరల్ ఎస్ఐకు ఫిర్యాదు అందజేస్తున్న రాంబాబు

పిఠాపురం రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, హోం మంత్రి వంగలపూడి అనితపై అనుచిత వాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని పిఠాపురం మాజీ ఎంపీపీ కురుమళ్ల రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు పిఠాపురం రూరల్ ఎస్ఐ గుణశేఖర్‌ను సోమవారం కలిసి ఫిర్యాదును అందజేశారు. జనసైనికులను జనసైకోలుగా పేర్కొన్న దువ్వాడతో పాటు అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా... ఇటువంటి వాటిని ప్రోత్సహిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌పై భారత శిక్షాస్మృతి ప్రకారం కేసులు నమోదు చేయాలని కోరారు. ఈ అంశాలపై వేర్వేరుగా ఫిర్యాదులు అందజేసినట్టు రాంబాబు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



మహిళలను సత్కరిస్తున్న దృశ్యం

సర్పవరం జంక్షన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ అధ్యక్షుడు రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగాల ద్వారా పలుసేవలు అందిస్తున్న మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఐసీడీఎస్ సీడీపీవో వై. లక్ష్మి మాట్లాడారు. సీడీపీవో లక్ష్మి, సచివాలయ కార్యదర్శి శిరీష, ప్రానిక్ హీలింగ్ వైద్యురాలు ఎం. వరలక్ష్మి, పోషకాహార నిపుణులు మల్లీశ్వరిని సత్కరించారు. ఎస్.శ్రీనగేష్, ప్రసాద్‌నాయుడు, కృష్ణమోహన్, శిరీష, చింతపల్లి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

వాకతిప్పలో కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ప్రదర్శనలో టీచర్లు, అంగన్‌వాడీలు

కొత్తపల్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వాకతిప్ప జడ్పీ హైస్కూల్లో సోమవారం బాల్యవివాహాలకు వ్యతిరేకంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగింది. తొలుత గ్రామపెద్దలతో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సీడీపీవో దుర్గాదేవి బాల్యవివాహాలు చేసుకోవడం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. అనంతరం కిషోరబాలికలతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో హెచ్ఎం పీ. కృష్ణారావు, సూపర్‌వైజర్లు అనంతలక్ష్మి, సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నాగులాపల్లిలో తాటాకిల్లు దగ్ధం

● రూ. లక్ష ఆస్తి నష్టం

కొత్తపల్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండంలోని నాగులాపల్లిలో సోమవారం సంభవించిన అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. దీంతో మూడు కుటుంబాలకు చెందిన వ్యక్తులు కట్టుబట్టలతో రోడ్డునపడ్డారు. కూతా సుబ్బిరెడ్డి, రామిరెడ్డికి చెందిన పెద్ద తాటాకిల్లులో చింతపల్లి ధనలక్ష్మి, పెనుమల్లు సత్యనారాయణరెడ్డి, నాగరత్నం అద్దెకు ఉంటున్నారు. వీళ్ల వ్యవసాయ పనుల నిమిత్తం ఉదయాన్నే పొలాల్లోకి వెళ్లిపోయారు. అయితే ఒక్కసారిగా ఇంటి నుంచి మంటలు చెలరేగినట్టు బాధితులు వాపోయారు. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్టు స్థానికులు చెబుతున్నారు. సంఘటనా స్థలాన్ని స్థానిక వీఆర్వో సుహాసిని పరిశీలించి, నష్టాన్ని అంచనా వేశారు. బాధిత కుటుంబాలకు తక్షణ ప్రభుత్వ సాయం కింద పది కిలోల బియ్యాన్ని అందజేసినట్టు ఆమె చెప్పారు.

పెద్దాపురంలో సత్యా ఏజెన్సీస్ షోరూమ్ ప్రారంభం



పెద్దాపురంలో ప్రారంభించిన సత్యా షోరూమ్

పెద్దాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురంలో సత్యా షోరూమ్ తన 51వ శాఖను ప్రారంభించింది. దీనికి ప్రోపర్టీ ఓనర్ డాక్టర్ శేఖర్ కుటుంబ సభ్యులు, సేల్స్ హెడ్ సెంథిల్, మార్కెటింగ్ హెడ్ గాంధీ, సత్యా ఏజెన్సీస్ ఉద్యోగులు హాజరయ్యారు. డీజీఎం సురేష్ మాట్లాడుతూ ప్రతి 1.5 టన్ 5 స్టార్ ఏసీ కొన్న కస్టమర్లకు టీవీను, అలాగే 1.5 టన్ 3 స్టార్ ఏసీ కొన్న వారికి టేబుల్ ఫ్యాన్‌ను ఉచితంగా ఇస్తామన్నారు. అన్ని గృహోపకరణాలపై 70 శాతం వరకు తగ్గింపు ఉందన్నారు. ప్రతి కొనుగోలుపై ఖచ్చితంగా బహుమతిని అందిస్తామన్నారు. దీనితో కలిపి ఏపీ, తమిళనాడులో 300 పైగా షోరూమ్‌లు ఉన్నాయి.

ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభం



పిఠాపురంలో నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

పిఠాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, జగ్గయ్యచెరువులోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల కళాశాల, హనుమంతరాయ, అంజనీ జూనియర్ కళాశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముందుగా విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

కరప: వేళంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 99 మంది తొలిరోజు పరీక్ష రాయాల్సి ఉండగా, ముగ్గురు గైర్హాజరైనట్టు సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ ఆచంట అంజిబాబు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ జె.డానియెల్ తెలిపారు.

ఓపెన్ ఇంటర్ పరీక్షలు కూడా...

సామర్లకోట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ సార్వత్రిక విద్య (ఓపెన్ స్కూల్) ఇంటర్ పరీక్షలు సోమవారం పట్టణంలోని మూడు పరీక్షా కేంద్రాలలో ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి 12 వరకు జరిగాయి. 781 మంది విద్యార్థులకు గాను 747 మంది హాజరుకాగా, 34 మంది గైర్హాజరయ్యారు. సామర్లకోట అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 297 మంది విద్యార్థులకు గాను 278 మంది హాజరయ్యారు. యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 168 మంది విద్యార్థులకు గాను 163 మంది హాజరయ్యారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 316 మంది విద్యార్థులకు గాను 306 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును డీసీబీ కార్యదర్శి వెంకట్రావు, జిల్లా సహాయ కోఆర్డినేటర్ వి.రాజశేఖర్ పరిశీలించారు.

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ



కళ్లద్దాలు అందజేస్తున్న దృశ్యం

సామర్లకోట, మార్చి (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కళ్లద్దాల పంపిణీ అభినందనీయమని ఎంఈవో వై. శివరామకృష్ణయ్య పేర్కొన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం కళ్లద్దాలను పంపిణీ చేశారు. హెచ్ఎం యూ. మీనామాధురి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఎంఈవో ముఖ్యఅతిథిగా హాజరయ్యి 45 మంది విద్యార్థులకు అందించారు.

నూతన విగ్రహ పతిష్ఠ

సామర్లకోట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గొంచాలలో సోమవారం భద్రాద్రి సీతారామ స్వామి వారి పరివార దేవత నూతన ఆలయ విగ్రహ పతిష్ఠ మహోత్సవం వందలాది భక్తుల జైశ్రీరామ్ నినాదాల మధ్య ఘనంగా నిర్వహించారు. విగ్రహ దాతలు పెదపూడి మన్నేశ్వరరావు దంపతులు ఆశీనులు కాగా, వేదమంత్రోచ్చారణల మధ్య విగ్రహ పతిష్ఠ, కళాప్రకర్షణ పూజలు, శాంతికర కల్యాణం నిర్వహించారు. ఈ పూజలలో తిరుమలై కందాడై రామానుజమఠం శ్రీలక్ష్మణాచార్య, విశ్వశాంతి ఫౌండేషన్ స్వామి లక్ష్మణాచార్య, వెల్లంపల్లి సుబ్రహ్మణ్యస్వామి, సామర్లకోటకు చెందిన హోల్‌సేల్ పండ్ల వ్యాపారులు నాగం వెంకన్నదొర, నాగం అశోక్ పాల్గొన్నారు. గొంచాల, అచ్చంపేట, తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దర్శనాల అనంతరం ప్రసాదాలు స్వీకరించారు. కాగా ఆలయంలో విగ్రహ దాత నాగం వెంకన్నదొర దంపతులు ఆశీనులై ప్రతిష్ఠ పూజలు చేశారు.

ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థికి బహుమతిని అందిస్తున్న ఎస్‌బీసీఎల్ జనరల్ మేనేజర్ రాజేష్

సర్పవరం జంక్షన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ రమణయ్యపేట శివారు గైగోపాలుపాడు హైస్కూల్లో శ్రీభవాని కాస్టింగ్స్ లిమిటెడ్ (ఎస్‌బీసీఎల్) హెచ్ఆర్ టి. శైలజ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. జాతీయ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన నివారణ చర్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎస్‌బీసీఎల్ జనరల్ మేనేజర్ కె. రాజేష్ మాట్లాడుతూ సరైన నివారణ చర్యలు తీసుకుంటే ప్రాణ, ఆస్తి నష్టం తగ్గించవచ్చన్నారు. డిపార్టుమెంట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సూచనల మేరకు జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించామన్నారు. పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. స్కూల్ హెచ్ఎం పి. చెల్లారావు, సంస్థ ఎస్‌వో కె.నెహ్రూ, పలువురు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ జేఏసీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మూర్తిబాబు

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జేఏసీ ఆఫ్ కాకినాడ జీజీహెచ్ జనరల్ బాడీ మీటింగ్ సోమవారం జరిగింది. జేఏసీ చైర్మన్ పాలపర్తి మూర్తిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జీజీహెచ్‌లో ఉన్న అన్ని ఉద్యోగ సంఘాలు ఉద్యోగుల సమస్యలపై మాట్లాడి జేఏసీకి వినతిపత్రం ఇచ్చారు. దీనిపై జేఏసీ నాయకులు వైద్య ఉద్యోగుల సమస్యలను జీజీహెచ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ జయ్‌ధీర్‌బాబు, కన్వీనర్ కట్టిమేను మోహన్‌రావ్, అన్ని యూనియన్ల నాయకులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు ఇద్దరు గైర్హాజరు

వై.రామవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రంలో సోమవారం జరిగిన ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్షా పత్రానికి ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. 139 మంది హాజరుకావాల్సి ఉండగా 137 మంది పరీక్ష రాశారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ఈశ్వరకృప పేర్కొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

రోగులకు వెంటనే పరీక్షలు నిర్వహించాలి

రాజవొమ్మంగి పీహెచ్‌సీని పరిశీలించిన ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రాజవొమ్మంగి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి పీహెచ్‌సీని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం సోమవారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రికార్డులు, అటెండెన్స్ పరిశీలించి వివరాలను సంబంధిత వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో కాన్పుల సంఖ్య పెంచాలని సూచించారు. గర్భిణులు ఎంత మంది ఉన్నారు, వైద్యం అందుతున్న తీరును పరిశీలించారు. ఆసుపత్రికివచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి సంబంధిత వ్యాధులకు ఉచిత మందులు అందజేయాలన్నారు. ఆసుపత్రిలో ఎంత మంది వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నతి, ప్రతీ రోజు ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సూపర్‌బజార్‌ను పీవో తనిఖీ చేశారు. వినియోగదారులకు నాణ్యమైన సరుకులను అందించాలన్నారు. డిపోలో స్టాక్ వివరాలు సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాజవొమ్మంగిలో బస్సు షెల్టర్ నిర్మించాలని గతంలో వచ్చిన అభ్యర్థన మేరకు స్థలాన్ని పరిశీలించా రు. తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, వైద్యాధికారి సుష్మ,సేల్స్‌ఉమెన్ మాతయ్యమ్మ ఉన్నారు.


రాజవొమ్మంగి పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న పీవో సింహాచలం

ఇంటర్ పరీక్షా కేంద్రం పరిశీలన

రాజవొమ్మంగిలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం పరిశీలించారు. ఏజెన్సీలో ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరైన విద్యార్థులకు ప్రశాంతమైన వాతావరణం కలిగించాలన్నారు. గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. విద్యార్థులకు మంచి వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా వెలుతురు, ఫ్యాన్లు, తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. తహశీల్దార్ సత్యనారాయణ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

రంపచోడవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసురుమిల్లి గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలను సోమవారం రాత్రి ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆకస్మిక తనిఖీ చేశారు. పీవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు స్టడీ సమయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, ఆహార పదార్థాల మెనూను పరిశీలించారు.

లెక్కలు తేలేదెన్నడో!

బ్యాంక్ మేనేజర్ చేసిన పనికి లక్షల్లో వడ్డీ కట్టిన డ్వాక్రా సంఘాల మహిళలు

రాజవొమ్మంగి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి యూనియన్ బ్యాంక్‌లో ఖాతాలు కలిగిన డ్వాక్రా సంఘాల వారికి తెలియకుండా వారి ఖాతాల్లో లక్షల రూపాయలు జమ అవ్వడం... మళ్లీ వారంలో ఆ సొమ్ములు తీసివేయడం గత నెలలో చర్చనీయంశమవడం, వెలుగు ఏపీడీ దేగలయ్య దర్యాప్తు చేసిన విషయం తెలిసిందే. అయితే గత నెలలోనే ఆంధ్రజ్యోతిలో 'డ్వాక్రా డబ్బులు వేయడం తీయడం ఆయన ఇష్టమే' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై గత నెలరోజులుగా వెలుగు అధికారులకు లెక్కలు తేలక తలమునకలవుతున్నారు. రాజవొమ్మంగి యూనియన్ బ్యాంక్‌లో మండలానికి చెందిన 658 డ్వాక్రా సంఘాలకు ఖాతాలు ఉండగా గత రెండేళ్లుగా ఆ ఖాతాలకు బ్యాంక్‌లో స్టేట్‌మెంట్లు ఇవ్వట్లేదు. గత నెలలో భారీగా అవకతవకలు జరిగినట్లు మండల మహిళ సమైఖ్య లీడర్లు, డ్వాక్రా మహిళలు ఫిర్యాదులు చేయడంతో కొన్ని డ్వాక్రా సంఘాల బ్యాంక్ ఖాతాల స్టేట్‌మెంట్లను వెలుగు అధికారులు తీసుకున్నారు. అయితే అన్ని బ్యాంక్ ఖాతాల స్టేట్‌మెంట్లను బ్యాంక్ సిబ్బంది ఇవ్వట్లేదని ఇప్పటివరకు ఇచ్చిన స్టేట్‌మెంట్లలో 78 డ్వాక్రా సంఘాల ఖాతాల్లో రూ.76220000 సొమ్ములను లబ్ధిదారులకు తెలియకుండా వారి బ్యాంక్ ఖాతాల్లో వేసి సుమారు వారం రోజుల తరువాత మళ్లీ తీసి వేసినట్లు అధికారులు గుర్తించారు. అయితే ఆ సొమ్ములు వారం రోజులపాటు వారి ఖాతాల్లో ఉండడం వల్ల రూ.125620 వారికి తెలియకుండానే డ్వాక్రా గ్రూపు సభ్యులు చెల్లించారు. అయితే పూర్తిస్థాయిలో అన్ని బ్యాంక్ ఖాతాల స్టేట్‌మెంట్లను గత నెల రోజులుగా బ్యాంక్ సిబ్బంది ఇవ్వట్లేదని, పూర్తిస్థాయిలో స్టేట్‌మెంట్లు ఇస్తే సుమారు రూ.10 కోట్ల వరకు సొమ్ములు వేసితీసుంటారని అధికారులు అభిప్రాయపడుతున్నారు. గత రెండేళ్లగా అనేకమార్లు బ్యాంక్ స్టేట్‌మెంట్లు ఇవ్వాలని అధికారులు బ్యాంక్ మేనేజర్‌ను కోరిన స్టేట్‌మెంట్లు ఇవ్వలేదని అధికారులు వాపోతున్నారు.

గండిపోశమ్మ ఆలయాభివృద్ధి పనులు ప్రారంభించాలి


సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆలయ సిబ్బంది, గ్రామస్థులు

దేవీపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపునకు గురవుతున్న దేవీపట్నం మండలం గొందూరు గ్రామంలోని శ్రీగండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి రక్షణ, అభివృద్ధి తదితర పనులను సత్వరమే ప్రారంభించి పూర్తి చేయాలని సోమవారం రంపచోడవరంలో సబ్‌కలెక్టర్ ఆర్.కల్పశ్రీని ఆలయ సిబ్బంది, గ్రామస్తులు కలిసి కోరారు. ఫైళ్లను పరిశీలించి ఈ విషయంపై ఉన్నతాధికారులతో మాట్లాడతానని సబ్‌కలెక్టర్ తెలిపారు.

కొండపల్లి గ్రామస్తుల ఆందోళన

రాజవొమ్మంగి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపల్లి గ్రామం ఎంపీపీ పాఠశాలలో 3,4,5 తరగతుల విద్యార్థులను మోడ్రన్ చదువుల పేరుతో రాజవొమ్మంగి తరలివచ్చడంటూ కొండపల్లి గ్రామస్తులు సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. తమ పిల్లల భవిష్యత్ కోరితే ప్రభుత్వం 3,4,5వ తరగతులను ఇక్కడే కొనసాగించాలని, 8కిలోమీటర్ల దూరంలో రాజవొమ్మంగి పంపడం కష్టమని తెలిపారు. అలాగే వర్షాకాలం రోడ్డు మధ్యలో ఉన్న వాగు పొంగితే దాటడం కష్టమని, ప్రభుత్వం తమ చర్యను విరమించుకోకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. అనంతరం ఎంపీడీవో యాదగిరీశ్వరరావుకు వినతి అందించారు.


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గండిపోశమ్మకు సినీనటుడు కాశీవిశ్వనాథ్ పూజలు

దేవీపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపోశమ్మ ఆలయాన్ని సోమవారం నువ్వులేక నేను లేను సినిమా దర్శకుడు, సినీ నటుడు కాశీ విశ్వనాథ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానికులు పలువురు ఆయనతో ఫొటోలు దిగారు.


గండిపోశమ్మ ఆలయంలో కాశీవిశ్వనాథ్

కవలలకు అభినందన

రాజవొమ్మంగి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంటికొండ పంచాయతీ ఎర్రంపాడు గ్రామానికి చెందిన ముర్ల రాము కాకినాడ జిల్లా రవాణాశాఖలో పరిపాలనాధికారిగా పనిచేస్తున్నారు. ఆయన కూతుళ్లు కవలలైన సౌజన్య, శరణ్య కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో మెడిసన్ పూర్తి చేశారు. ఇటీవల మెడికల్ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అతిథుల చేతులమీదుగా ఎంబీబీఎస్ పట్టాలు అందుకున్నారు. వారికి రాజవొమ్మంగి సర్పంచ్ ఆగూరు సుబ్బలక్ష్మి, టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దరాజు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.


ఎంబీబీఎస్ పట్టాలు అందుకున్న సౌజన్య, శరణ్య

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

తప్పిన ప్రమాదాలు... నిలిచిన ప్రాణాలు!

అన్నవరం దేవస్థానం ఘాట్‌రోడ్డులో డివైడర్‌పైకెక్కిన పెళ్లి బృందం బస్సు

అన్నవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం ఘాట్‌రోడ్డులో సోమవారం వేకువజామున పెనుప్రమాదం తప్పింది. రాజమండ్రికి చెందిన వివాహబృందం సత్యగిరి కొండపై వివాహతంతు ముగించుకుని తిరుగు ప్రయాణంలో సుమారు 40 మందితో ప్రయివేట్ బస్సులో తమ స్వస్థలానికి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. బస్సుడ్రైవర్ చాకచక్యంతో లోయలో పడకుండా స్టీరింగ్‌ను కొండవైపుకు తిప్పడంతో డివైడర్ పైకెక్కి స్తంభాన్ని ఢీకొని నిలిచిపోయింది. బ్రేకులు ఫెయిల్‌కావడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఎవరికీ ఎటువంటి గాయాలు కాకుండా బయటపడడం సత్యదేవుడి మహిమగా పెండ్లి బృందం భావించింది.



తునిలో డివైడర్‌ను ఢీకొన్న కారు



తుని రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో ఓ కారు వేగంగా వచ్చి అదుపు తప్పడంతో డివైడర్‌ను బలంగా ఢీకొంది. దీంతో ఆ పక్కనే వెళుతున్న ద్విచక్రవాహనచోదకుడికి గాయాలయ్యాయి. కారు నడుపుతున్న ఎన్.వాసు అనే యువకుడికి తీవ్ర గాయాలై కాళ్లు, చేతులు విరిగాయి. వారిని స్థానికులు తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్టు సీఐ జి.రామకృష్ణ తెలిపారు. ఎప్పుడు రద్దీగా ఉండే ప్రాంతంలో ప్రమాదం జరిగే సమయంలో జన సంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ప్రమాదానికి కారణం కారు అతివేగమే కారణంగా తెలుస్తోంది.

'సంపద కేంద్రాలను అభివృద్ధిలోకి తీసుకురావాలి'

గండేపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో సంపద కేంద్రాలను అభివృద్ధిలోకి తీసుకొచ్చి సంపద తయారు చేసి విక్రయాలు చేయాలని డీఎల్పీవో బాలామణి కోరారు. సోమవారం ఆమె నీలాద్రిరావుపేటలోని సంపద తయారీ కేంద్రం వద్ద మండలంలోని కార్యదర్శులతో సమావేశం అయ్యారు. సంపద కేంద్రం ఉందని ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, స్టాల్స్ పెట్టి విక్రయాలు చేయాలన్నారు. గ్రామాల్లో హైవేపక్కన, రోడ్ల పక్కన ఇష్టానుసారంగా చెత్త వేస్తున్నారని... వేయకుండా హెచ్చరిక బోర్డులు పెట్టి గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. చెత్త వేస్తే ఫైన్ విధించాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్ల వేగవంతం చేయాలన్నారు. వసూలు చేయని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పారిశుధ్య నివారణకు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ చంద్రశేఖర్, కార్యదర్శి వెంకటసత్యరామనాథ్, పీఎస్ గురు, తరంగణి తదితరులు పాల్గొన్నారు.


కార్యదర్శులతో సమావేశమైన డీఎల్పీవో బాలామణి

ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు రూ.515.95 కోట్లు కేటాయింపుపై హర్షం

జగ్గంపేట , మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు రూ.515.95 కోట్లు కేటాయించడంపై రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్-డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన జగ్గంపేటలో మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచీ ఆర్యవైశ్యుల అభివృద్ధికి పెద్ద పీట వేస్తోందన్నారు.


అరుణాచలేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకస్వాములు

అరుణాచలేశ్వరునికి విశిష్ట పూజలు

ప్రత్తిపాడు , మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి అరుణాచలేశ్వర ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. రమణ సేవాశ్రమ నిర్వాహకుడు రామానంద స్వామి ఆధ్వర్యంలో వేదపండితులు అరుణాచలేశ్వరునికి వివిధ రకాల పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. ఆలయ ఆవరణలో కొలువైన బసవేశ్వరునికి కూడా పూజలు జరిపి పంచహారతులు ఇచ్చారు. అపీత కుచాంబ అమ్మవారికి కుంకుమార్చన చేశారు.

జిల్లా స్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక

తొండంగి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ విజ్ఞాన వారోత్సవాల సందర్భంగా ఈ నెల ఒకటో తేదీన నిర్వహించిన క్విజ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్టు తొండంగి ఎంఈవో షేక్ బాబ్జీ తెలిపారు. తొమ్మిది, ఎనిమిది తరగతులకు నిర్వహించిన పోటీల్లో కొత్తపెరుమాళ్ళపురం, బెండపూడి, ఎ.కొత్తపల్లి ఉన్నత పాఠశాలల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరంతా మంగళవారం కాకినాడలో జరిగే పోటీల్లో పాల్గొంటారు.

'జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి'

తుని రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈ నెల 14న జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, కుడా చైర్మన్ తుమ్మల బాబు కోరారు. జనసేన నాయకుడు బోనం చినబాబు అధ్యక్షతన తునిలో సోమవారం జరిగిన సమావేశానికి జిల్లా కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ప్లీనరీ విజయవంతంపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలు, కూటమి పార్టీలతో సమన్వయలోపంతో ఎదురవుతున్న సమస్యలపై జిల్లా అధ్యక్షుడితో చర్చించారు. ప్లీనరీ అనంతరం ప్రతి సమస్యకు పరిష్కారం వైపుగా చొరవ చూపుతానని బాబు హామీనిచ్చారు. సమావేశంలో జనసేన నాయకులు దండెం రామకృష్ణ, చోడిశెట్టి గణేష్, వి.నాగేంద్ర, పలివెల లోవరాజు, బెండపూడి నాయుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తుమ్మల బాబు

దళితుల నిరసన

తుని రూరల్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట దళిత జేఏసీ, అంబేడ్కర్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో శ్రేణులు తునిలో సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టాయి. ఐపీఎస్ పీవీ సునీల్‌కుమార్ సస్పెన్షన్‌ను కూటమి ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని అంబేడ్కర్ ఇండియా మిషన్ జిల్లా అధ్యక్షుడు జల్లు చినబాబు హెచ్చరించారు. కొల్లాబత్తుల దిలీప్‌కుమార్, జగటాలు వీరబాబు, తంతటి కిరణ్, పెదపాటి మేఘరంజాన్, కొంకిపూడి రాజ్యలక్ష్మి, దారా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లో పేదలకు అన్నదానం

జగ్గంపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సోమవారం గోకవరం గుబ్బలమ్మ గుడి కమిటీ చైర్మన్ , టీడీపీ సీనియర్ నాయకుడు ఆచంట రాజుబాబు, విజయలక్ష్మి దంపతుల కుమారుడు, టీడీపీ యువ నేత ఆచంట బాబీ-డాక్టర్ శిరీష దంపతుల ఆర్థిక సహాయంతో నిర్వహించిన క్యాంటీన్‌ను రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు, దాత ఆచంట రాజు, బాబీ ప్రారంభించి 500 మంది పేదలకు భోజనాలు వడ్డించారు. దేగల సత్తిబాబు, గోకాడ వెంకటేశ్వరరావు, గోకాడ వెంకటలక్ష్మి, తుమ్మ గంటి వీరబాబు, చిక్కాల సుగుణ, చిక్కాల శ్రీను, చిక్కాల లక్ష్మణ్, కోడూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం


ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు

22 మంది గైర్హాజరు

ఏలేశ్వరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని కేంద్రాల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు, సంస్కృతం పరీక్షలకు 588 మంది విద్యార్థులకు 22 మంది గైర్హాజరైనట్టు డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు ఎ.రామకృష్ణ, కె.శారద, చీఫ్ సూపరింటెండెంట్లు కర్రోతు బాబ్జీ, సత్యనారాయణ తెలిపారు.

'అక్రమంగా చెట్లు నరికిన వారిపై చర్యలు చేపట్టండి'

శంఖవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం రాక మునుపు నుంచీ బాటసారులకు నీడనిస్తున్న చెట్లను ఎటువంటి అనుమతులు లేకుండా నరికివేసిన వారిపై చర్యలు చేపట్టాలని జనసేన నేత మేకల కృష్ణ కోరారు. సోమవారం జనసేన కార్యాలయంలో జరిగిన జనవాణిలో ఈ అంశంపై ఫిర్యాదు చేశారు. కత్తిపూడి నుంచి శంఖవరం, కొంతంగి, తుని వెళ్లే రహదారులకు ఇరువైపులా ఉన్న చెట్లను నరికి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారని, దీనిపై జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. శంఖవరంలో ఆక్రమణకు గురవుతున్న శ్మశానవాటికలను కాపాడాలని, వాటి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కృష్ణ ఆ వినతిపత్రంలో పేర్కొన్నాడు.


జనవాణిలో వినతిపత్రం ఇస్తున్న కృష్ణ

'స్వయం సహాయక సంఘాలు అన్నీ లోకోస్ యాప్‌లోకి'

కోటనందూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక గ్రూప్‌లను లోకోస్ యాప్‌లోకి ఎక్కించేందుకు చర్యలు చేపడుతున్నామని ఏపీఎం సూర్యకుమారి తెలిపారు. సోమవారం కోటనందూరులోని వెలుగు కార్యాలయంలో వీవోఏ, సీసీలకు లోకోస్ యాప్‌పై ట్రైనర్ నాగేశ్వరరావు శిక్షణ ఇచ్చారు.

వైసీపీ ఇన్‌చార్జి గిరిబాబు పర్యటన

ప్రత్తిపాడు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం, ప్రత్తిపాడుల్లో వైసీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు సోమవారం పర్యటించి నాయకులు, కార్యకర్తలను కలిశారు. ఆయన వెంట జడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరిదొరబాబు, గుడాల వెంకటరత్నం, మండల ఉపాధ్యక్షుడు బంకు శ్రీను, జలిగంపల ప్రభాకరరావు, శేరు కృష్ణ, బదిరెడ్డి గోవిందు, చల్లా సత్యనారాయణ, దొళే చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

'పుష్కర'కి నిధులు కేటాయించండి

అసెంబ్లీలో తుని ఎమ్మెల్యే దివ్య



తుని రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సాగు, తాగునీటి సమస్యలపై తుని ఎమ్మెల్యే యనమల దివ్య అసెంబ్లీలో తన వాణి వినిపించారు. నీటిపారుదల శాఖపై చర్చ జరుగుతుండగా పుష్కర కాలువను పూర్తిస్థాయిలో ఆధునికీకరించేందుకు రూ.9.50కోట్ల నిధులు అవసరం ఉంటుందని అధికారిక లెక్కలు చూపిస్తూ మెట్ట రైతుల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.


సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

'అభివృద్ధికి నిధులివ్వండి'

ప్రత్తిపాడు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని సీఎం చంద్రబాబును ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ సోమవారం కోరారు. ఈ మేరకు అమరావతిలోని అసెంబ్లీ ప్రాంగణంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. ప్రత్తిపాడు వైద్య విధాన పరిషత్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసి అభివృద్ధి చేయాలన్నారు. ఏలేశ్వరంలోని అప్పనపాలెం వంతెన నిర్మాణం వెంటనే చేపట్టాలని, శంఖవరంలో శిథిలావస్థలో ఉన్న వివిధ భవనాల పునర్నిర్మాణానికి నిధులు విడుదల చేయాలన్నారు.



ఆర్టీసీ ఉద్యోగుల రిలే దీక్షలు

ఏలేశ్వరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపో వద్ద ఎంప్లాయిస్ యూనియన్ నేతృత్వంలో సోమవారం రిలే దీక్షలు చేపట్టారు. సర్క్యులర్‌కి విరుద్ధంగా డ్రైవర్ ఎస్వీ రమణపై అక్రమ సస్పెన్షన్ విధించి విధుల నుంచి తొలగించడం సరికాదన్నారు. కె.అప్పారావు, ఎస్ఎస్ రాజు ఎర్ర బ్యాడ్జీలు ధరించి దీక్షలో కూర్చున్నారు. వారికి భోజన విరామ సమయంలో ఉద్యోగులు మద్దతు తెలిపారు. ఎన్ఎంయూఏ కార్యదర్శి కె.త్రిమూర్తులు, ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి యూబీఎం కుమార్, ఎన్‌పీ రావు, కార్మికులు సంఘీభావం ప్రకటించారు.

పశు గర్భకోశ వ్యాధుల నివారణకు చర్యలు

శంఖవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధుల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు పీతల మనోజ్ కుమార్ తెలిపారు. సోమవారం శంఖవరంలో పశు వైద్య శిబిరం నిర్వహించి లేగ దూడల ప్రదర్శన జరిపారు. లింగనిర్ధారణ వీర్యం ద్వారా పుట్టిన లేగదూడలకు బ్రూసెల్లా వ్యాక్సిన్ వేశారు. ఎదకు రాని పశువులకు చికిత్స చేసి మందులు, మినరల్ మిక్చర్ అందజేశారు. పశువైద్యులు కె.ప్రసాద్, టి.లావణ్య, వీరరాఘవరావు, విభ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.